కాశ్మీర మజిలీలు

(బస్సుకడ భాగవతము)

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు

నాలో నే నిట్లు వితర్కించుకొనుచుండ నెదుటనున్న బోండా నన్ను పలుకరించినాడు. సొంతధోరణి మొదలిడినాడు. తన యూరు అమృతసరమునకు మూడుక్రోశుల దూరమందున్నదట. తనపూర్వులు కనోజ్ సమీపమందలి ఉత్తరపూరిలోనుండువారట. తనకు తొమ్మండుగురు ఆడుబిడ్డలట, ఇరువురు మగబిడ్డలట. పెద్దవాడు ఇంటినంటియుండి సేద్యముసేయించుచు, తలిదండ్రులకు నేడుగడయైయున్నాడట. రెండవవాడే తన కడగొట్టు బిడ్డయట. వాని వయసు పదునాలుగేండ్లట. అమృతసరమున మేనమామ యింటనుండి హిందీ సంస్కృతములు చదువుచున్నాడట. కొడుకును చూచుటకై అపుడపుడు తాను అచటికి పోవుచుండునట.

బోండాధోరణి నడచుచునేయున్నది. రాత్రి ఎనిమిదిగంటలు కడచిపోయెను. కాని, ఇంకా బస్సు కదలలేదు. మహాకాయుడైన ఒక ప్రయాణీకుడు రెండుసీట్ల నడుమదారిలో అవస్థ పడ దొడగినాడు. తోడివారు సగమువఱకు నూడియున్న సీటును పూర్తిగ నూడవెఱికి, వానిని లేవనెత్తి "పతితపావనులైరి". డ్రైవరు అఱువసాగినాడు. బస్సులో కొంత యలజడి బయల్దేరినది. "ఠండారహో! ఠండారహో!" (శాంతింపుడు! శాంతింపుడు!) అని ఒక్కొకరునితో చెప్పసాగితిని. "ఠండారహో! ఠండారహో!" అని బుడంకాయి అఱువసాగినాడు. బస్ కండక్టరును పిలిచితిని. జవాబు రాలేదు. ఆ మహాశయుడందు లేనేలేడు.

పదునాలుగు భువనములలో కండక్టర్ ఏ భువనమందు విహరింపబోయినాడో ఎఱుగను. కొనినటికెట్లకు తర్పణము వదలి, భక్తిపూర్వకముగా బస్సుచుట్టు ముమ్మాఱు ప్రదక్షిణముచేసి, వేఱుత్రోవను చూచుకొన దలచితిని. నడిరేయిగాని నాటికి లాహోరు పోవు రైలులేదు. పోనీ పంతముపట్టి బస్సుతో పందెమువేసి నడచిపోదమనిన నను దూరము సామాన్యమైనది కాదు. నిశీథమున ముప్పదిరెండు మైళ్లు కాలినడకను పోవుటెట్లు? కడుపులో ఇపుడు ప్రోగైన స్టీమ్ ఒక మైలునడువగనే ఖర్చగునేమో! చిత్తై తెరువునడుమ పడెదనేమో యను యడలు ఏదారినుండియో వచ్చి గుండెలో ప్రవేశించినది. ఇంత ఇబ్బందికి కారకుడైన మహాశయుని మూపెక్కిపోదుననుకొనినను, వాడు పొట్టి పిచికియైపోయినాడు. వానికి మూపే లేదు. తిరిగి దాదాజీపై ఫిరంగువలె పడుటకు నామనసొప్పలేదు. డి. పి. మీందికిక బుద్ధిపాఱలేదు.

గంటవెంబడి గంట కడచినది. స్నానసమయము దాటినది. హైరాను అధికమైనది. ఎప్పటినొప్పి తలలో ప్రవేశించి తాండవమాడ దొడగినది! సహనము హృదయమునుండి అంతర్ధానమైనది. "అరే! కండక్టర్!" అని పిచ్చివానివలె అఱచితిని. ఎందో విహరించుచున్న వాని చెవులో కేకపడినది.

నిముసములో బస్సులోని కొక స్వరూపము తొంగిచూచినది. "క్యా హాల్ చాల్?" అని కుశల ప్రశ్న వేసినది. గుండెలో భగ్గుండ రవుల్కొనినది! "హాల్ చాల్"ట. ఇందటి నీవేళ నిట్టి యిబ్బందికి పాల్పడజేసి ఏమియు నెఱుగనివానివలె పాపము క్షేమ మరయుచున్నాడు! చివాలున బస్సునుండి యుఱికి "ఇది కదలునా కదలదా? ఇది క్షమింపరాని దోషము. తగుచర్య దీసి కొనమందువా? ఎవరి పైకము వారికి వాపసుచేసి ఎదుటినుండి లేచిపోదువా?" అని బిగ్గఱగా పల్కితిని. నామాటలు తనకుకాక ఆకాశవాణికి ఉద్దేశింపబడినవని వాడు ఊహించియుండును. నా నుడువులు సంపూర్ణముగ వినక పెద్దంజలువేయుచు, నీమూలనుండి ఆమూలకు నడచి ఏదో సొంతఘోష నేకరువుపెట్టుచు, ఏవో హిందూస్థానీ పేరుల నెత్తుచు రంకెలువేసి దూరముగపోయి నిలిచినాడు. నాలుగడుగులు ముందునకువేసి "ఏమందువు?" అని అఱచితిని. "పూఛియే బాబూసాబ్ పూఛియే!" (అడుగుడు అయ్యా అడుగుడు) అని బస్సులోని మహాపురుషులు నిముసముసేపు కయ్యముమాని నాకు హుషారీయసాగిరి. నాపలుకు సగము చెవినిబడినంతనే నిలిచినవాడు వడివడిగ (తోడ్తోడనే సొంతసొదను సాగించుచు) నీ మూలనుండి నామూలకు చతురంగములోని 'సెగటు'వలె నడచి చివాలున నిలిచిపోయి నాడు.

ఈ వింతమనిషియొక్క వింతప్రవర్తనము నా కబ్బురము గొలిపినది. వీని వాలకమే ఒకమాదిరిగానున్నది. ముదురు మొగమునిండా గంట్లు! చెంపమీదికి దిగజారిన పాగా! వీని వయసు నలువదేండ్లుండును. కదుపడిగగాని ఈతడు మాట్లాడడు; ఇదేరీతిగగాని నడువడు. రెండు నిముసముల కొక పర్యాయము విగ్రహమువలె కొంతసేపు గడసి మాట వినవచ్చినంతన కిఱుకిఱుమను చడావులతో చరచర మఱల నడువ గడంగును. ప్రస్తుతవిషయమునకు లవమైన సంపర్కములేని సొంతరొదను మొదలిడును. వీనికి ప్రియమైన మోటు మాటలు రెండు మూడున్నవి. ఉండి యుండి వీనితోనే ఈతడు తన ధోరణి మొదలిడుచుండును. మాటలాడునపుడు ముక్తముఖమునుండి మెఱపులు వెడలుట గనుపట్టితిని. అవి ఏమైయుండునని మఱింత తీక్ష్ణముగ పరీక్షించితిని. పాపం! పల్లువరుస పై నీతడు బంగారుచుక్కలను చెక్కించుకొనినాడు! ఈరీతి యలంకరణమును స్త్రీపురుషులలో ఉత్తరహిందూస్థానమున పెక్కుసారులు చూచితిని.

బుడంకాయి నావెనుక బస్సునుండి మాటముల్లెలతో దుమికినాడు. నా మాటలనే తానుకూడ పలుకుచు గొంతుక చిరుగునట్లఱచుచు, కండక్టరు వెంట నుఱుకు లెత్తుచు కోతివలె ప్రవర్తించుచున్నాడు. ఓటికుర్చిపై గంభీరముఖుడై కూర్చుని యున్న కేలిబర్ "బలే! బలే!" యని వీని

నృత్యమును ప్రోత్సహించుచున్నాడు. బస్సులోనివా రొక్కరొక్కరుగ దిగిరి. "బాబూజీ! బాబూజీ!" అని బోండా మాటిమాటికి కేకలు వేయసాగినాడు. తానుకూడ క్రిందికి దిగవలెననియే ఆతని యుద్దేశము. కాని వానిని దింపుటకు దిగ్గంతులే రావలెనని గ్రహించియేయుంటిని. కావున వాని దరిజేరనైతిని.

కొండఱు పొట్టిపిచికి వేడుకజూచుచు, ప్రయాణ మాలశ్యమగుచున్నదని కొందఱు కారములను మిరియములను నూఱుచు, "భోజనసమయము దాటిపోయినది" అని మఱికొందఱు చతికిలపడి యఱచుచు వేర్వేఱు తెఱగుల బ్రవర్తింపసాగిరి. సగము విఱిగిన మూడుకాళ్ల కుర్చీమీద గొప్ప యుద్యోగి తన వదనారవిందమును మఱింత గంభీరము గావించి, ముక్కద్దములను ముక్కుతుద వ్రాలించి మొగము సగము వంచి "టికెట్ లేలేవ్! లేలేవ్ టికెట్!" అని తఱచుగా అఱచుచునే యున్నాడు. "బస్సు కదలదేమి?" అని ప్రయాణీకులు ప్రశ్నించినప్పుడు "బోల్తా హుం టికెట్ లేలేవ్!" ("టికెట్ తీసుకొనుమని చెప్పుచున్నాను") అని యాతడు స్వరము హెచ్చించి పలుకుచున్నాడు. ఎవరిధోరణి వారిదే! సంబంధ బాంధవ్యమెక్కడైనా కనుపించలేదు. కండక్టరు ప్రవర్తన మట్లేయున్నది. "ఈ మోళీ చూచుట తగదనియు, ఇక కిక్కురుమనుట అవివేకమనియు, ఇందింకను తడసియుండుట మఱెంత యవివేకమనియు" తలచి బుడంకాయిని పిలచి, గిఱ్ఱున నందుండి తిరిగితిని. మఱలపోయి దాదాజీ కొంపపై పడకతప్పదని ఇంత గ్రంథము నడచినపిదప గ్రహించి నడుముగట్టి నడువదొడగితిని.

పదియడుగులు వేసితిని. ఇంతలో "బాబూజీ! బాబూజీ!" అను కేకలు వినబడినవి. నిముసము నిలువంబడితిని. మూటముల్లెలతో దాపునుండి నడచు పొట్టిపిచికి కూడ నిలచినాడు. "ఆయియే! ఆయియే! చల్‌తీహై" అను యఱపులు వినబడినవి. కంఠస్వరము బోండాదని గ్రహించితిని. ఆక్షణమే హార్న్ వినబడినది. చచ్చిన గొడ్డువలెనున్న బస్సునకు ఊపిరివచ్చినది కాబోలు. నాతో నేమియుజెప్పక సామానుతో బుడంకాయి వెన్కకు పరుగెత్తినాడు. నేనట్లే నిలువంబడిపోతిని. దిగవిడిచిన బస్సులో ప్రవేశించుటకు మానసమియ్యకొనుచుండుటలేదు. కాని "దానితోగాని, దాని కండక్టరు డ్రైవరులతోగాని పంతము నాకేల?" అని పరక్షణమందే యోచింపదొడగితిని. ఇంతవఱకు కాలహరణమైన పిదప ఫలమునందక అప్రతిభుడనై తరసిపోవుట తగదనియు, కడచిన దానిని త్రవ్వుకొనక ఇప్పటియదను పోనాడక, కదలిపోవు బస్సులో ప్రవేశించుటే ఉచితమనియు, కావలసినది కార్యసాధనము కదాయనియు తలపోసితిని. పైగా పిచికిగాడపుడేపోయి సామానుతో బస్సులో చతికిలపడి "ఆయియే! ఆయియే!" ("రండు, రండు") అని ఎడతెఱపిలేక నన్ను పిలువసాగినాడు.

పునర్గమనమును ఆత్మగౌరవమునకు ముడిపెట్టుట తగదనియు, బోడిగోడలలో విడియుటకు భగవంతుడు సమ్మతింపనట్లు గణనీయములు కాని అల్పాంశములందు ఆత్మగౌరవము తన పీఠమును ప్రతిష్ఠించుకొనదనియు, ఉత్కృష్టాంశములందే అది స్వీయమందిరము నవలోకించి (గుండెలో జొరబడు నవశక్తివలె) అందు ప్రవేశించి జేగంట మ్రోగించుననియు, ఫాల్స్ ప్రెస్టిజ్ బండమెదడుగలవానికి పనికివచ్చునుగాని మతిమంతునకును, ధృతిమంతునకును గాదనియు, ఒడుదొడుకు తలపులతో ముందంజవేయుటకంటె గభీర యోచనతో వెనుకంజవేయుటే ఘనతరమైన కార్యమనియు, సంయమసామర్థ్యములతో అంకితమైయుండు ఈ వెనుకంజ ఆత్మశక్తిగలవానికే, దూరదృష్టిగలవానికే, విశాలహృదయము గలవానికే సాధ్యమనియు, ఇట్టి వెనుకంజ దశయోజనముల ముందంజకు కన్నతల్లి కాజాలుననియు, జీవితగతి జంత్రగమనము బోలునది కాదనియు, కిన్నెరచానవలె దృష్టిలో నెందో నగుమోమున నెలయు ఉదాత్తాశయగళమునకు తాళిగట్టునది యాత్రయందలి భావలక్ష్మి గాని అందలి యడుగులసంఖ్య కాదనియు, మేధావులైన రాజకీయవేత్తలును, తాత్త్వికులును, ఆచార్యులును, ప్రవక్తలును, మతనేతలును సమయాసమయములందు వెనుక నిలిచియే, శిరములు వాంచియే, లొంగియే స్వీయమహత్త్వమును ప్రకటించి లాతివారి మెడందలందలి పశుప్రవృత్తులను పడగొట్టి, వ్రజవనితలుపోలు సద్భావముల కందురహదారు లేర్పఱచి, మనుష్యజీవితమున రాసక్రీడనే కాంచి, మిత్రులగులికి జయగీతిక లాలపించిరనియు, క్షుద్రహృదయుల కొద్ది చూపులుగాని, మొటకుల పరియాచకములు గాని, దుర్మతుల యెత్తిపొడుపులు గాని, దూరదృష్టికిని పూర్వాపరాంశములను గుఱించిన ఉచితచింతనమునకును నలవడని భావదరిద్రుల ఈసడింపులు గాని గర్భమున దేవదేవు నిడికొనిన దేవకివలె నిజాంతరంగములందు మణికాంతులీను విజ్ఞానవిభవము నిడికొనిన మహాత్ముల మనసులను ముట్టజాలవనియు, అవినాభావసంబంధము గల వారి మతికిని గతికిని నడుమ నివి గట్టుల దొరను నిలుపలేవనియు, ఆత్మవిశ్వాసమును దృఢనిశ్చయమును జయవిజయులై హృదయమందిరద్వారమున పాలకులై యుండ బరంజ్యోతి అంతరంగగర్భాలయమున తేజరిల్లుచుండ ప్రతికూలాభిప్రాయములును, నిష్ఠురోక్తులును, అసురసేనబోలు అవస్థలును, అరవిందములపై నడుగులు వేయుచు లుంబినీవనమున జరించిన అవతారపూరుషుని గమనమును బురుడించు ఉదాత్తజీవితగతి కెట్టి దుర్గతి తేజాలవనియు చిత్తమువచ్చిన ట్లంతరంగమున భావకందుకములను దొరలించుకొనుచు, తోడ్తోడనే అడుగులువేయుచుపోయి బస్సులో ప్రవేశించితిని. "ఆయా! బాబీ ఆగయా!" అని లోనిప్రముఖులు మహోల్లాసమున నఱచిరి.